క్లుప్తంగా

రీ సర్వేకు వివరాలు అందించాలి

పెనమలూరు: రీసర్వే ప్రకియకు రైతులు వివరాలు ఇవ్వాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య తెలిపారు. గ్రామంలో భూముల రీ సర్వే ఇప్పటికే చేపట్టి చాలా వరకు పూర్తి చేశామన్నారు. ఇంకా కొందరు రైతులు వివరాలు ఇవ్వలేదని తెలిపారు. అటువంటి రైతులు వారి భూములకు సంబంధించి డాక్యుమెంట్లు, లింకు డాక్యుమెంట్లు, పట్టదార్ పాస్ పుస్తకం, పాస్‌పోర్టు ఫొటోలు గ్రామ రెవెన్యూ అధికారులకు అందించాలని అన్నారు. రైతులు డాక్యుమెంట్లు ఇచ్చి రీసర్వే చేయించుకోవాలని సూచించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పెనమలూరు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని సీడీపీవో కె.బేబిసుకన్య తెలిపారు. గంగూరు గ్రామంలో బుధవారం అంగన్‌వాడీ-4 కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బేబిసుకన్య మాట్లాడుతూ పౌష్టికాహారం తల్లులు, చిన్నారుల ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తుందన్నారు. తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు ఉండే పౌష్టికాహారం తయారు చేసుకోవచ్చని చెప్పారు. రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు తదితర ఆహార పదార్థాలతో పౌష్టికాహారం తయారుచేయవచ్చని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం తయారు చేసే విధానాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు వివరిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ టి.రమానాగమణి, సచివాలయ అధికారులు ఎం.లిఖిత, ఎం.జ్యోతి, పి.ప్రేమ్‌సుధాకర్, డి.దుర్గ, రాజేష్‌బాబు, ప్రశాంత్‌కుమార్, ఏఎన్ఎం మార్తమ్మ పలువురు పాల్గొన్నారు.

తాడిగడపలో వృద్ధుడు అదృశ్యం

పెనమలూరు: తాడిగడప గ్రామంలో వృద్ధుడు అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. తాడిగడప కార్మికనగర్‌లో పూర్ణచంద్రరావు అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఆయనతో పాటు అతని తాత దూడల సుబ్బారావు (74) కలిసి ఉంటున్నాడు. కాగా ఈ నెల 4వ తేదీన పూర్ణచంద్రరావు బంధువుల పెళ్లికి మచిలీపట్నం వెళ్లాడు. తాత సుబ్బారావు 6వ తేదీన మచిలీపట్నానికి వస్తానన్నాడు. అయితే తాత సుబ్బారావు రాకపోయేసరికి ఎన్ని సార్లు ఫోన్ చేసినా సమాధానం రాలేదు. ఈ నెల 12వ తేదీన పూర్ణచంద్రరావు మచిలీపట్నం నుంచి తాడిగడప ఇంటికి వచ్చి చూడగా తాత సుబ్బారావు కనిపించలేదు. అతని కోసం పలు ప్రాంతాల్లో వెతికినా అతని ఆచూకీ తెలియకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఆర్.రఘు విన్నవించారు. యూనియన్ కార్యాలయంలో బుధవారం కార్మికుల సమావేశం నిర్వహించారు. రఘు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కారం చేయాలని కోరుతున్నా అధికారులు స్పందించటం లేదన్నారు. చాలా కాలంగా కార్మికుల సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మున్సిపాలిటీ కార్మికుల గౌరవ అధ్యక్షుడు ఉప్పాడ త్రిమూరి తమాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 27వ తేదీన నిరసన వ్యక్తం చేస్తామన్నారు. కమిషనర్ స్పందించక పోతే భవిష్యత్తు కార్యక్రమం ప్రకటిస్తామని తెలిపారు. నేతలు షేక్.కాశిం, షేక్.మస్తాన్‌వలి, కొండలు, సరళ,రత్నకరుణ, వెంకటరెడ్డి,దుర్గారావు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాలు

విజయవాడరూరల్: మండలంలోని నున్న గ్రామ సచివాలయం 3లో మంగళాపురం, అంబాపురం గ్రామాల్లో బుధవారం విద్యార్థులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సీజనల్ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్తలో భాగంగా టీకాలు వేసినట్టు హెల్త్ సూపర్‌వైజర్ కన్నా తెలిపారు.

వినాయక పందిళ్లలో ప్రత్యేక పూజలు



పోరంకిలో వినాయకుడి విగ్రహాన్ని నిమజ్జనానికి తీసుకెళుతున్న భక్తులు



కానూరు తులసీనగర్‌లో గణనాథుడు

పెనమలూరు: మండల పరిధిలో వినాయకుడి పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నాయి. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయకుడి పందిళ్లలో భక్తులు ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు పోరంకి, కానూరు, యనమలకుదురు తదితర ప్రాంతాల్లో పలు వినాయుడి విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఊరేగించారు. టపాసులు కాల్చి మేళతాళాలతో గ్రామ వీధుల్లో ప్రదర్శించారు. అనంతరం వినాయకుడి విగ్రహాలను నిమజ్జనానికి కృష్ణానదికి తీసుకెళ్లారు. పోరంకి రామాపురంకాలనీ రోడ్డులో ఉన్న వెంకట్రాం గ్రాండ్‌లో వినాయక నిమజ్జనం సందర్భంగా పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విశ్రాంత చిత్రలేఖన ఉపాధ్యాయుడు ఎ.అప్పారావు ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. భక్తులు ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

ఉత్సాహంగా గణేష్ నిమజ్జనం

కంకిపాడు: గణేష్ నిమజ్జనాలు ఊరూరా ఘనంగా జరుగుతున్నాయి. గణేష్ నవరాత్రుల్లో భాగంగా బుధవారం ఈడుపుగల్లు, వేల్పూరు తదితర గ్రామాల్లో గణేష్ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఈడుపుగల్లులోని ఆనంద్ విహార్‌లో ఏర్పాటుచేసిన వినాయక ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విఘ్నేశ్వరుడికి భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా లడ్డూ వేలం నిర్వహించారు. ఐదు కిలోల స్వామి వారి లడ్డూను పుర్రి భాస్కర్ రూ.6 వేలకు దక్కించుకున్నారు. ఉత్సవాన్ని కమిటీ ప్రతినిధి సాంబయ్య తదితరులు పర్యవేక్షించారు.



బీబీగూడెంలో నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



ఈడుపుగల్లు ఊరేగింపులో మహిళలు

కోలాహలంగా బీబీగూడెంలో నిమజ్జనోత్సవం

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో బుధవారం పలు చోట్ల వినాయక నిమజ్జనాలు భక్తుల కోలాహలం మధ్య వైభవంగా జరిగాయి. బీబీగూడెం గ్రామంలో మద్దిరావమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన మండపంలోని విఘ్నేశ్వరుని విగ్రహాన్ని భక్తుల జయజయ ధ్వానాల మధ్య అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గ్రామంలోని వీధివీధి తిరుగుతూ భక్తుల పూజలందుకున్న వినాయకుడిని సమీపంలోని పోలవరం కాలువ వద్ద నిమజ్జనం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమ్మిశెట్టి రఘుబాబు, మండల మాజీ వైస్ ప్రెసిడెంట్ సామల ఆంజనేయులు, నాగార్జున, మణికంఠ, మండూరి జానకిరామయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారుల ఉన్నతికి ప్రభుత్వం చర్యలు



ఆర్చరీ క్రీడాకారుడు అబ్దుల్ రషీద్‌కు ఆర్చరీ కిట్ అందజేస్తున్న తుమ్మల చంద్రశేఖర్

కంకిపాడు: క్రీడాకారుల ఉన్నతికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని కమ్మ సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్ తుమ్మల చంద్రశేఖర్ (బుడ్డి) అన్నారు. పటమట పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న అబ్దుల్ రషీద్ విలువిద్యలోనూ ప్రావీణ్యం ఉండటంతో అతన్ని ప్రోత్సహిస్తూ రూ.45 వేలు విలువల చేసే ఆర్చరీ కిట్‌ను బుధవారం తన నివాసంలో పంపిణీ చేశారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ వివిధ రంగాల్లో సేవలు అందిస్తూ క్రీడలపై ఉన్న ఆసక్తితో ఎందరో క్రీడల్లో తమ సత్తా చాటుతున్నారన్నారు. క్రీడల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ సర్కారు విశేష కృషి చేస్తుందన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహిస్తూ అవకాశాలను కల్పిస్తుందని చెప్పారు. ప్రతిభావంతులకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని పేర్కొన్నారు. ఆర్చరీ క్రీడాకారులకు చెరుకూరి సత్యనారాయణ అందిస్తున్న చేయూత అభినందనీయమన్నారు. వసతులను, వనరులను సద్వినియోగం చేసుకుంటూ క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



తేలప్రోలులో జగనన్న ఆరోగ్య సురక్ష ర్యాలీ

ఉంగుటూరు: వలంటీర్లు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించాలని ఎంపీడీవో శేషగిరిరావు సూచించారు. తేలప్రోలులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను బుధవారం ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలతో పాటు రక్తహీనత ఉన్నవారిని గుర్తించాలన్నారు. జీరో ఎనిమిక్ కేసులే లక్ష్యంగా పని చేయాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి పరీక్షలు చేయించి ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, ఇన్‌చార్జ్ కార్యదర్శి అప్పారావు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న జెడ్పీటీసీ ఎలిజబెత్ రాణి

గన్నవరం: గ్రంథాలయాల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయానికి బుధవారం విద్యార్థుల కోరిక మేరకు కథల పుస్తకాలను ఆమె బహూకరించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రంథాలయంలో విలువైన పుస్తక సంపదను వినియోగించుకుని విజ్ఞాన సముపార్జన చేసుకోవాలని కోరారు. చరిత్రలో ఎంతోమంది గ్రంథాలయాలను ఉపయోగించుకుని గొప్ప వ్యక్తులుగా ఎదిగారని గుర్తు చేశారు. విద్యార్థులు వారానికి కనీసం ఒక రోజైనా గ్రంథాలయానికి వెళ్లే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని చెప్పారు. గ్రంథాలయ కమిటీ అధ్యక్షులు నర్రా సీతారామారావు, సభ్యులు చిమట రామారావు, విశ్రాంత అధ్యాపకులు గన్నె వెంకట్రావు, గ్రంథాలయ ఇన్‌చార్జ్ దొండపాటి బాబూరావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు బాపులపాడు విద్యార్థులు



జిల్లా స్థాయి ఆటల పోటీలకు ఎంపికైన బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలకు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ నుంచి 20 మంది విద్యార్థులు ఎంపికై నట్లు ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, ఫిజికల్ డైరెక్టర్ పామర్తి వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఇటీవల గన్నవరంలో జరిగిన నియోజకవర్గ స్థాయి ఆటలపోటీల్లో విశేష ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో కబడ్డీ జట్టుకు కొడాలి దీవెనరాజు, ఖోఖో జట్టుకు గోకాడ హేమసాయికృష్ణ, వాలీబాల్ జట్టుకు మంగళగిరి ఆదిత్య, త్రోబాల్ జట్టుకు కొడవలి ఆకాష్, కాళిదాసు సంతోష్, టెన్నికాయిట్ జట్టుకు పులవర్తి సన్నీ, షటిల్ బ్యాడ్మింటన్ జట్టుకు గొల్లపల్లి రంజిత్, యోగాలో వల్లెపు సంతోష్ శామ్యూల్, మద్దాల కార్తీక్ కుమార్, గోకాడ హేమసాయికృష్ణ, బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు కొడవలి ఆకాష్, పులవర్తి సన్నీ ఎంపికై నట్లు వివరించారు. అండర్-17 విభాగంలో కబడ్డీ జట్టుకు షేక్ హనీఫ్, వాలీబాల్ జట్టుకు పులవర్తి మహేష్, త్రోబాల్ జట్టుకు గొల్లపల్లి సుమంత్, బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఉప్పు ప్రభుతేజ, రవికిరణ్, అక్కపోలు రోహిత్, యోగాలో గొల్లపల్లి సుమంత్, రవికిరణ్, మద్దాల రామచంద్, ప్రభుతేజ ఎంపికయ్యారని తెలిపారు. వీరంతా త్వరలో జరిగే ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలకు గన్నవరం నియోజకవర్గ జట్టు తరపున ప్రాతినిధ్యం వహించనున్నట్లు వివరించారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు

కంకిపాడు: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ కె.సుధాకర్ కథనం మేరకు...కంకిపాడుకు చెందిన అచ్చి దుర్గ, ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంకు చెందిన శివశంకర్‌కు 10 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన శివశంకర్‌తో పాటు అత్తమామలు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నేడు పేరంటాలమ్మ ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో గురువారం దేవదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో హుండీలను లెక్కిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి తెలిపారు. భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో హుండీల్లో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొంటారు.

రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెలకు గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రోడ్డు ప్రమాదంలో అక్కాచెల్లెలకు గాయాలైన ఘటన బుధవారం కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘటనపై బాధితుల తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తూరు తాడేపల్లికి చెందిన సింహాద్రి వెంకటేశ్వరరావు వ్యవసాయం చేస్తుంటాడు. వెంకటేశ్వరరావు పెద్ద కుమార్తె కల్పన నగరంలోని ఓ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం చేస్తుంటుంది. బుధవారం ఉదయం కల్పనను కాలేజీ వద్ద దింపేందుకు చిన్న కుమార్తె స్పందన మోపెడ్‌పై బయలుదేరగా, చెరువు వద్దకు వచ్చే సరికి మోపెడ్ వెనుక టైర్ పంక్చరై రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. చిన్న కుమార్తె స్పందనకు స్వల్పగాయాలు కాగా, కల్పన తలకు, కంటికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో కల్పనను బీఆర్టీఎస్ రోడ్డులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.

ట్యాబ్‌ల సద్వినియోగంపై దృష్టి పెట్టాలి

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల విద్యాశాఖాధికారి రామ్‌బాలాసింగ్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో బుధవారం ట్యాబ్‌ల వినియోగంలో సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నోడల్ అధికారి మహమ్మద్ దావూద్, శిక్షకులు పి.శివాజీ నేతృత్వంలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ట్యాబ్‌లు మరమ్మతులకు గురైనా, పగిలిపోయినా సంబంధిత గ్రామ సచివాలయాలను సంప్రదించాలని చెప్పారు. హెచ్‌ఎం నిమ్మగడ్డ రవీంద్రభవాని, పలువురు సీఆర్‌ఎంటీలు, సచివాలయ వెల్ఫేర్ అసిసెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ, సాఫ్ట్ స్కిల్స్‌పై వర్క్‌షాప్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో నలంద డిగ్రీ కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాంది స్కిల్స్ ట్రైనర్ డి.భవానీ, రజనీలు 110 మంది విద్యార్థినులకు కమ్యూనికేషన్ స్కిల్స్, గ్రూప్ డిస్కషన్, సెల్ఫ్ ఇంట్రడక్షన్, రెజ్యూమ్ ప్రిపరేషన్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూ టిప్స్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం అనురాధ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందిస్తే క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ప్లేస్‌మెంట్స్ పొందుతారన్నారు. కార్యక్రమంలో చంద్రగిరి, బి.రజనీప్రదీప పాల్గొన్నారు.



విద్యార్థినికి మెమొంటో అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనురాధ తదితరులు

నేడు ఆక్రమణల తొలగింపు

విజయవాడరూరల్: నున్న గ్రామంలో బ్యాంక్ సెంటర్‌లో గురువారం ఆక్రమణలు తొలగిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు తెలియజేశారు. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఆక్రమణలు తొలగించాలని కోర్టుకు వెళ్లిన నేపథ్యంలో విజయవాడ సబ్ కలెక్టర్ అతిథి సింగ్ ఆదేశాల మేరకు ఆక్రమణలను గుర్తించి వారికి నోటీసులను అందజేసినట్టు ఎంపీడీఓ తెలియజేశారు. గ్రామంలో 12 ఆక్రమణలను గుర్తించామని, ఆక్రమణదారులు స్వచ్ఛందంగా ఖాళీ చేయవచ్చని ఎంపీడీఓ అన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నున్న(విజయవాడరూరల్): గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందిన బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ బీమా ఆర్థిక సహాయం 10 వేల రూపాయలను నున్న గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ బుధవారం అందజేశారు. ఈ నెల 14న గుండెనొప్పితో మృతిచెందిన కొండపల్లి రాంబాబు(38) కుటుంబానికి ఈ మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ, వార్డు సభ్యుడు వల్లూరి వెంకట శివ పాల్గొన్నారు.

బోధన తీరు పరిశీలన



గంగూరు స్కూల్లో ఐబీ ప్రతినిధులు

పెనమలూరు: గంగూరులోని బ్లూమింగ్ డేల్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను ఇంటర్నేషనల్ బాక్యులరేట్ (ఐబీ) ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. యూరప్‌కు చెందిన ఆంటోని బెగున్, వాషింగ్‌టన్‌కు చెందిన మాథ్యూకాస్టెల్లో, సౌత్ ఏషియన్ సీనియర్ డెవలప్‌మెంట్ ప్రతినిధి మహేష్ బాలకృష్ణన్, ఏపీ ఎసెస్‌మెంట్ బోర్డు ప్రతినిధి సతీష్ పాఠశాలలో కరికులమ్, ఇంటిగ్రేషన్ బోధన, హోలిస్టిల్ అప్రోచ్ విధానం వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీఐఎస్ అందిస్తున్న విద్యా విధానం గురించి విద్యార్థులు ఐబీ ప్రతినిధులకు వివరించారు. పాఠశాలలో మౌలిక వసతులు పట్ల ప్రతినిధి బృందం ప్రశంసించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ అట్లూరి విజయ్‌బాబు, డైరెక్టర్ అట్లూరి శుభాష్, ప్రిన్సిపాల్ హర్‌సిమ్రాన్‌కౌర్ పాల్గొన్నారు.

మందుల దుష్ఫలితాలపై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): మందుల దుష్ఫలితాలు వచ్చినప్పుడు వెంటనే వైద్యుడిని సంప్రదించేలా ప్రజల్లో అవగాహన పెరగాలని సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ అన్నారు. ఫార్మకో విజిలెన్స్ జాతీయ వారోత్సవాలను పురస్కరించుకుని వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్ జెండా ఊపి ప్రారంభించగా, ఎంబీబీఎస్ మొదటి, రెండో ఏడాది విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.వెంకట రమణ, ప్రొఫెసర్ డాక్టర్ స్వరలత తదితరులు పాల్గొన్నారు.

వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలి



ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో ముచ్చటిస్తున్న కమలానందభారతి స్వామి

విజయవాడకల్చరల్: వేద సంస్కృతిని పరిరక్షించుకోవాలని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి అనుగ్రహ భాషణ చేశారు. అమరావతి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల మహోత్సవంలో భాగంగా బుధవారం స్వామి ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. స్వామి మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మం విశిష్టమైనదని దానిని పరిరక్షించుకోవాలని సూచించారు. మంగళమూర్తి వినాయకుడని ఆయనను సేవించుకోవడం శ్రేయోదాయకమన్నారు. బ్రాహ్మణులు నిత్య అనుష్ఠానపరులై సమాజానికి మార్గదర్శిగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. భారతీయ ఆధ్యాత్మిక వైభవం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమం కోసం కృషి చేస్తోందని తెలిపారు. వినాయక విగ్రహానికి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ శర్వాణి మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీవీఆర్ హైస్కూల్ విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి కృష్ణా జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ – 16, 18 విభాగాల్లో దుర్గాపురం ఎస్టీవీఆర్ నగరపాలకసంస్థ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్ర అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాల పదో తరగతి విద్యార్థి బి.ప్రవల్లిక అండర్ – 16 మూడు వేల మీటర్ల రేస్ వాక్ ఈవెంట్‌లో, కె.మోహన్ రావు అండర్ – 18 డిస్కస్ త్రో ఈవెంట్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాలలో ప్రవల్లిక, మోహన్‌రావుకు అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం ఎం.సూర్యప్రభ మాట్లాడుతూ.. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర చాంపియన్ షిప్‌నకు ఎంపిక కావటం ఆనందంగా ఉందన్నారు. వీరిని మరింత మంది విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జలసూత్రం వెంకట్రావు, ఉపాధ్యాయురాలు ఎల్.విజయలక్ష్మి, ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటి నగరానికి, పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.